మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే..



గాజువాక కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

- రాష్ట్రంలో సంక్షేమం కొనసాగుతుంది
- గాజువాకలో భారీ మెజార్టీతో గెలుస్తాం
- రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

గాజువాక: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గాజువాకలో భారీ మెజార్టీతో గెలుస్తామన్నారు. పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గాజువాకలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో 40 ఏళ్లుగా పరిష్కారం కాని అనేక సమస్యలను జగన్ మోహన్‌రెడ్డి పరిష్కరించారన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఆ అభివృద్ధి కొనసాగేందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిల విజయానికి సహకరించాలని కోరారు.

ఐదేళ్లలో పేదలకెంతో మేలు

దేశంలో మరే ఇతర రాష్ట్రాలలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని సుబ్బారెడ్డి అన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారని, గత ఎన్నికల సమయంలో రుణమాఫీపై మాట ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి తన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. ఐదేళ్లలో రుణమాఫీ అమలు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి సొంత ఇంటి కలను నిజం చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాలలో అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చి పేదవాడికి మేలు చేశారన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో 16 మెడికల్ కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేశామన్నారు. గతంలో ప్రభుత్వాలు ఇలాంటి ఆలోచనలు చేయలేకపోయాయని అన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నది వైఎస్సార్‌సీపీయే

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించడానికి సిద్ధపడిన బీజేపీతో చేతులు కలిపిన టీడీపీ, జనసేనకు ఓటు వేస్తే మనం స్టీల్‌ప్లాంట్‌ను కోల్పోయినట్టేనని గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ప్రస్తావనకు వచ్చినప్పటి నుంచీ దానిని వ్యతిరేకిస్తున్నది వైఎస్సార్‌సీపీ ఒకటేనన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు 1140 రోజులుగా దీక్షలు కొనసాగిస్తున్నా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏనాడైనా నిలువరించిందా అని ప్రశ్నించారు. దీన్నిబట్టి స్టీల్‌ప్లాంట్ కార్మికుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలిచి ఉందన్న విషయాన్ని ప్రజలంతా అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావాలని పేద ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సీఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైనవారందరికీ పథకాలను ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ఆయన విజయయాత్రను ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా పని చేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. తాను విజయం సాధిస్తే గాజువాకను మరింతగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు ఉరుకూటి అప్పారావు, మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, ఇల్లపు ప్రసాద్, మహ్మద్ గౌస్, సిరట్ల వాసు, రెడ్డి జగన్నాథం, కోమటి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, మహాలక్ష్మినాయుడు, ప్రమీల, యువశ్రీ, మొల్లి చిన్న, మస్తానప్ప, గొందేశి మహేశ్వరరెడ్డి, బొడ్డ గోవింద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కూటమికి ఓటేస్తే స్టీల్‌ప్లాంట్‌ను వదులుకోవాల్సిందే..

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా నిలుపుదల చేసేందుకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. తెలుగువారి మనోభావాలను దెబ్బతీసే విధంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి బీజేపీ సిద్ధపడిందన్నారు. అటువంటి పార్టీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకోవడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు మద్దతు తెలియజేస్తున్నాయన్నారు. కూటమికి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్‌ను వదులుకోవాల్సి వస్తుందన్నారు.

అమర్‌నాథ్‌కు యాత సామాజిక వర్గం మద్దతు



అమర్‌నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న యాత సామాజిక వర్గం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు వివిధ సామాజిక వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ క్రమంలో యాత సామాజిక వర్గం నాయకులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు మిందిలోని మంత్రి నివాసంలో బుధవారం ఆయన్ను కలుసుకుని, సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి యాత సామాజిక వర్గానికి ఎంతో మేలు చేశారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటామన్నారు. గాజువాకలో అమర్‌నాథ్ విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యాత సామాజిక వర్గం నాయకులు బొడ్డ కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, పెంకె మారేష్, సంపంగి మంగరాజు, ఓనుమ, హనుమంతరావు, నడిగట్ల దేముడు, కడగల నానాజీ, పోలవరపు నరసింహారావు, ఢిల్లీ సోమేష్, రంగాల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ



మహాజన సభలో ప్రసంగిస్తున్న సొసైటీ ఉపాధ్యక్షుడు ఆనందకుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ 37 ఏళ్లుగా ప్రగతిపథంలో ముందుకు సాగుతోందని త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం ఉపాధ్యక్షుడు కె.ఆనందకుమార్ అన్నారు. స్టీల్‌క్లబ్‌లో జరిగిన త్రిఫ్ట్ సొసైటీ 59వ వార్షిక మహాజన సభలో ఆయన మాట్లాడుతూ 12,993 సభ్యులతో రూ.361 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ పని చేస్తోందన్నారు. ఏటా ఆడిట్ వర్గీకరణలో ఏ గ్రేడ్ సొసైటీగా నిలుస్తుందన్నారు. కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి వార్షిక నివేదికను అందజేశారు. కోశాధికారి కొండరాజు 2024–25 బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో డైరెక్టర్లు కర్రి శ్రీనివాస్, వి.జి.మహీధర్, సీనియర్ మేనేజర్ కె.దామోదర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు



పెదముషిడివాడ హైస్కూల్లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

అగనంపూడి: ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు ముగిశాయి. ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పదో తరగతి కామన్ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 28న ఫస్ట్ లాంగ్వేజ్–2 (కాంపోజిట్) పేపర్, 30న సంస్కృతంతో పాటు ఒకేషనల్ కోర్సు పరీక్ష మినహా సాధారణ పరీక్షలన్నీ బుధవారంతో పూర్తయ్యాయి. అనకాపల్లి జిల్లాకు సంబంధించి పరవాడ మండలంలోని లంకెలపాలెం, పెదముషిడివాడ హైస్కూల్స్, విశాఖ జిల్లాకు సంబంధించి గాజువాక మండలం, అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద పోలీసులతో పాటు వార్డు సచివాలయాల మహిళా పోలీసులు పహారా కాయడంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలి



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులతో పాటు దేశ ప్రజలందరిపై ఉందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 1140వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాలు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల పోరాట ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేస్తే దేశ ప్రజలెవరూ సహించరన్నారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

3 నుంచి మహిళలకు వేసవి శిక్షణ తరగతులు

మురళీనగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పేస్ట్రీ షాపు సమీపంలోని భవనంలో కె.సుగుణ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ స్టిచింగ్‌పై పది రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు 90320 94771 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

రూ.1.07 కోట్ల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీకి ఆస్తిపన్ను చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ రెవెన్యూ అధికారులు బుధవారం కోటి ఏడు లక్షల రూపాయల ఆస్తి పన్ను వసూలు చేశారు. హిందూజా, కేఎల్ఎం షాపింగ్ మాల్ సహా వివిధ వార్డుల్లోని గృహ యజమానుల నుంచి వసూలు చేసిన చెక్కులను జోనల్ రెవెన్యూ అధికారులు సీహెచ్.రామ్‌నారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు రెడ్డి మోహన్, శివ, సుభాన్ తదితరులు జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు అందజేశారు. ప్రతీ ఒక్కరు ఆస్తి పన్ను చెల్లించాలని, ఈ నెలాఖరులోగా చెల్లిస్తే ఆస్తి పన్నుపై పూర్తి వడ్డీ మాఫీ ఉంటుందని జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మరిడిమాంబ జాతర నేడు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలస గ్రామ ఇలవేల్పు మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆలయాన్ని అధునాతన విద్యుద్దీపాలతో అలంకరించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. అగనంపూడి పరిసర నిర్వాసితకాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి జాతర్లో పాల్గొనుండడంతో ఆలయ, ఉత్సవ కమిటీలు భారీ సన్నాహాలు చేశాయి.

ఘనంగా డీవీఆర్ యూనియన్ వార్షికోత్సవం



మొక్కలు నాటుతున్న ఉక్కు అధికారులు, యూనియన్ నాయకులు

పెదగంట్యాడ: డీవీఆర్ యూనియన్ 8వ వార్షికోత్సవాన్ని పెదగంట్యాడలోని యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం గాంధీ, హెచ్ఆర్ జీఎం రాజు తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ధర్మాల వెంకట రమణారెడ్డి, అధ్యక్షుడు గళ్లా శంకర్‌సాయిరాం, వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు



హైవేపై కవాతు చేస్తున్న ఎస్ఐ వెంకటరావు, సీఐఎస్ఎఫ్ బలగాలు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరాం ప్రసాద్ నేతృత్వంలో సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు,సివిల్ పోలీసులు, బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టారు. అక్కయ్యపాలెం, నందగిరినగర్, తాటిచెట్లపాలెం, ఏఎస్సార్ నగర్, 80 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తూ స్థానిక ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు.

శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి తదితరులు

గాజువాక: వాంబే కాలనీ వెంకటాద్రిపై నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు వెబ్‌సైట్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆలయ చైర్మన్ దొడ్డి రమణ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమై వచ్చేనెల 3వ తేదీ వరకు కొనసాగుతాయని, 3న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్లు, ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ



మింది హైస్కూల్‌ను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక, మింది ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ బుధవారం సందర్శించారు. మింది జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించిన ఆయన పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గాజువాక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్, నియమావళి పూర్తిగా అమలయ్యేలా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథరావు, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భద్రతకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఉక్కు భద్రతా విభాగాధిపతి రామ్‌ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తమ విధి నిర్వహణలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె.సోబ్టీ సూచించారు. జాతీయ స్టీల్ భద్రతా దినోత్సవాల్లో భాగంగా 'లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ సేఫ్టీ' అంశంపై ఉక్కు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్ కుమార్ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఉక్కు భద్రతా విభాగాధిపతి డాక్టర్ డి.రామ్ ప్రసాద్ భద్రతా నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో భద్రతా విభాగం అధికారులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

శేషతల్పంపై అప్పన్న



శేషతల్పంపై అప్పన్న తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు



అప్పన్న ఉత్సవమూర్తులు

- పరవశించిన భక్తజనం
- వైభవంగా తిరువీధి
- జనసంద్రంగా మారిన సింహగిరి మాడ వీధులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహించిన సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామికి శేషతల్పంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి శేషతల్పంపై అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన పురోహితుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ స్థానం ప్రత్యేకం

- స్టీల్‌ప్లాంట్‌లో కీలక సంఘంగా గుర్తింపు
- గుర్తింపు, కో–ఆపరేటివ్ ఎన్నికల్లో సత్తా
- యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నేడు

వైఎస్సార్‌టీయూసీ లోగో


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల్లో యువజన శ్రామిక రైతు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (వైఎస్సార్‌టీయూసీ) ప్రత్యేక కార్మిక సంఘంగా గుర్తింపు సాధించింది. స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్మిక సంఘాలు మెజార్టీ సంఘాలుగా ఏలుబడి సాగిస్తున్నాయి. అయితే వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావం తర్వాత ప్రతీ గుర్తింపు ఎన్నికల్లో వైఎస్సార్‌టీయూసీ కీలకంగా మారింది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తర్వాత దాని అనుబంధంగా 2012 మార్చి 28న వైఎస్సార్‌టీయూసీని ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 2013 ఫిబ్రవరి 25న యూనియన్ ప్రారంభించిన నాటి నుంచి వైఎస్సార్‌టీయూసీ దిన దిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ కార్మికుల మన్ననలు పొందుతోంది. స్టీల్‌ప్లాంట్ శాఖ జిల్లాలోని ఇతర పరిశ్రమల సంఘాల కంటే ఒక ప్రత్యేకస్థానంతో దూసుకుపోతోంది.

అనతికాలంలోనే గుర్తింపు

ప్లాంట్‌లోని 26 కార్మిక సంఘాల్లో 24వ కార్మిక సంఘంగా రిజిస్టర్ అయిన వైఎస్సార్‌టీయూసీ అతి తక్కువ కాలంలో తన ప్రత్యేకతను చాటుకుంటుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిపై అభిమానం గల కార్మికుల అండతో అనతికాలంలోనే ఐఎన్‌టీయూసీ, సిటూ, ఏఐటీయూసీల తర్వాత స్థానానికి చేరుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన మొదట గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సుమారు వెయ్యి ఓట్లు సాధించి అటు యాజమాన్యం, ఇటు కార్మికుల్లో సంచలనం రేకెత్తించింది. దీంతో ప్రధాన కార్మిక సంఘాలు వైఎస్సార్‌టీయూసీ పొత్తు కోసం ఆసక్తి కనబరుస్తున్నాయి. ఆ తర్వాత జరిగిన కో–ఆపరేటివ్ స్టోర్స్ ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు మొత్తం 4500 ఓట్లు సాధించడం విశేషం. ఆ తర్వాత జరిగిన 2018 గుర్తింపు ఎన్నికల్లో వైఎస్సార్‌టీయూసీతో జతకట్టిన ఏఐటీయూసీ 3200 ఓట్లు సాధించింది. 2022లో స్టీల్‌ప్లాంట్ గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీతో జతకట్టి గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి గట్టి పోటీ ఇవ్వడంలో కీలకపాత్ర వహించింది.

కార్మిక సమస్యలపై యూనియన్ నాయకులు స్పందిస్తున్న తీరుకు కార్మికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ తీరుపై స్పందించాల్సిన ఇతర కార్మిక సంఘాలు మౌనపాత్ర వహిస్తుండగా గుర్తింపు యూనియన్ వైఫల్యాలపై వైఎస్సార్‌టీయూసీ గళమెత్తుతూ కార్మికుల ప్రశంసలు పొందుతోంది.

వైఎస్సార్ ఆశయసాధనకు కృషి



కార్మిక సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసి వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ సాధన కోసం పనిచేస్తున్నాం. ప్లాంట్‌లో గుర్తింపు యూనియన్ లోపాలను ఎత్తిచూపుతూ కార్మికుల పక్షాన గళమెత్తుతున్నాం. భవిష్యత్తులోనూ ఇదే పంథాతో ముందుకు సాగుతాం.

– వై.మస్తానప్ప, ప్రధాన కార్యదర్శి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

మానవతా దృక్పథం పెరగాలి

ఏయూక్యాంపస్: సమాజంలో మతవిశ్వాసాల కంటే మానవతా దృక్పథం నెలకొల్పడం ఎంతో అవసరమని శ్రీకాకుళం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్. రజిని అన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగంలో బుధవారం నిర్వహించిన ధార్మిక విజ్ఞాన పరిణామం–ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మనుషుల మధ్య మతం అడ్డుగోడగా మారకూడదన్నారు. మతాల సారాంశం తోటి వారిని ప్రేమించడమే అన్నారు. స్వార్థంతో మత ఘర్షణలకు పాల్పడుతూ మానవుడు సమాజంలో అశాంతికి కారణంగా మారుతున్నాడని ఈ విధానంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి నేపథ్యంలో ప్రపంచం కుగ్రామంగా మారిందని, అదే సమయంలో మానవతా విలువలు లోపిస్తున్నాయన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, బెంగళూరు యాక్స్ అకాడమీకి చెందిన సంతోష్ జ్ఞానకస్, విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, అమెరికాలోని బ్రిగామ్ యంగ్ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ఆచార్యులు చార్లెస్ విలియం నికోలస్, డాక్టర్ బి.వెంకట స్వామి తదితరులు ప్రసంగించారు.

30 నుంచి అంతర్జాతీయ గణిత శాస్త్ర సదస్సు



పోస్టర్ విడుదల చేస్తున్న ఆచార్య అనురాధ కామేశ్వరి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 30, 31 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.అనురాధ కామేశ్వరి తెలిపారు. సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆచార్యులతో కలిసి ఆవిష్కరించారు. గణితం, అనువర్తిత గణితం, ఇంజినీరింగ్ గణితం అంశాలపై సదస్సు జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ఆచార్య ఎస్.మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఏయూ గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తాయని తెలిపారు. కొరియా నుంచి ఆచార్య వై.జె. చో, ఆచార్య జి.వి.ఆర్. బాబు కీలకోపన్యాసాలు చేస్తారన్నారు. నేపాల్, ఆస్ట్రేలియా, భారత్‌కు చెందిన 12 మంది వక్తలతో పాటు 200 మంది వరకు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు పి.డి.ఎస్. శ్రీనివాసు, ఆచార్య జి.నానాజీరావు, ఎస్.రవికుమార్, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.